
PRGI. No. TGTEL/25/A5314.

# అర్జున్ సమాచారమ్

ఎడిటర్: లింగం రాజయ్య

తెలుగు దిన పత్రిక




నల్లగొండ | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjun samcharam.com | గురువారం 7, మే 2026 | సంపుటి :1 సంచిక : 51 | పేజీలు : 4 , వెల.2.00

## విజయ్‌కు గవర్నర్ ఆహ్వానం..

# ప్రమాణ స్వీకారానికి రాహుల్ గాంధీ

కాంగ్రెస్ శాసనసభా పక్షం టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు

చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకారం



తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్నాయి. తమిళనాడు కాంగ్రెస్ శాసనసభా పక్షం టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ విజయ్‌ను బుధవారం ఉదయం కలిసింది. ఈ నేపథ్యంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో విజయ్ కలుసుకోనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరనున్నారు. ఈ విషయాన్ని గవర్నర్ సైతం ధ్రువీకరించారు. ఈనెల 7న చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకారానికి విజయ్ పార్టీ సన్నాహాలు చేస్తుండగా, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఈ ప్రమాణస్వీకారానికి హాజరయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



వార్త 2లో



2 లో..

## తెలంగాణలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీ

తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు.



# కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్..



- రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం
- ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి
- రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం
- బడేభాయ్ చెప్పినట్లుగా.. చోటేభాయ్ ఆడుతున్నారు
- కాంగ్రెస్.. కరోనా కంటే డేంజర్
- మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు

వార్త 2లో

సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు(బుధవారం) వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.




## భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ నియామకం చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు

తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం చెల్లదంటూ హైకోర్టులో టి. ధన్‌పాల్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని హైకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు.

2



2

## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే..

రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత

హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు శాపనార్థాలు

మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్



2

## కేటీఆర్ వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్



2

## కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం: సీతక్క

## కెటిఆర్‌కు బండి సంజయ్ కరెక్ట్: అద్దంకి

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఏ కెటిఆర్ దిగజారి మాట్లాడుతున్నారని ఎంఎల్ సి అద్దంకి దయాకర్ విమర్శించారు. కెటిఆర్ కౌంటర్ కు అద్దంకి రీకౌంటర్ ఇచ్చారు. మాజీ సిఎం కెసిఆర్ గురించి కాంగ్రెస్ నేతలు మర్యాదగా మాట్లాడాలని కెటిఆర్ అంటున్నారని, కానీ సిఎం రేవంత్‌పై కెటిఆర్ మర్యాద ఎందుకు మరిచారని ప్రశ్నించారు.



2



2

## రిచ్ కిడ్స్ ట్రాప్ అండ్ రేప్ కేస్ లో సంచలన నిజాలు వెలుగులోకి

# విజయ్‌కు గవర్నర్ ఆహ్వానం..
# ప్రమాణ స్వీకారానికి రాహుల్ గాంధీ

**కాంగ్రెస్ శాసనసభా పక్షం టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు**

**7న చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకారం**

చెన్నై: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్నాయి. తమిళనాడు కాంగ్రెస్ శాసనసభా పక్షం టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు తెలుపుతూ విజయ్‌ను బుధవారం ఉదయం కలిసింది. ఈ నేపథ్యంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో విజయ్ కలుసుకోనున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరనున్నారు. ఈ విషయాన్ని గవర్నర్ సైతం ధ్రువీకరించారు. ఈనెల 7న చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణస్వీకారానికి విజయ్ పార్టీ సన్నాహాలు చేస్తుండగా, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఈ ప్రమాణస్వీకారానికి హాజరయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



**వేగంగా పరిణామాలు**

టీవీకేకు మద్దతు ఇవ్వాలని విజయ్ నేరుగా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వాన్ని కోరినట్టు ఆ పార్టీ ఎంపీ, సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలియజేయడంతో పార్టీ తమిళనాడు శాసనసభాపక్షం బుధవారం చెన్నైలో సమావేశమైంది. ఈ సమావేశంలో టీవీకేకు మద్దతు తెలపాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిని ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జి గిరిశ్ చోడంకర్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయంలో విజయ్‌ను కాంగ్రెస్ నేతలు కలుసుకుని మద్దతు తెలియజేశారు. తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు 108 సీట్లలో గెలుపు అవసరం కాగా, టీవీకే 108 సీట్లు గెలుచుకుంది. 5 సీట్లు గెలిచిన కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో ఆ బలం 113కు చేరింది. పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) నుంచి ఎంపికైన నలుగురు ఎమ్మెల్యేలు కూడా విజయ్‌ను ఆయన నివాసంలో కలిసారు. కాగా, తలో రెండు స్థానాలు గెలిచిన సీపీఐ, సీపీఐ, వీసీకేతో పాటు ఒక చోట గెలిచిన ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతిచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

## తెలంగాణలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు.

బ్రహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్: బస్వరాజు శ్రీనివాస్
కమ్మ కార్పొరేషన్ చైర్మన్: బండి రమేశ్
వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్: గట్టు తిమ్మప్ప
యాదవ కార్పొరేషన్ చైర్మన్: రఘునాథ్ యాదవ్
వడ్డెర కార్పొరేషన్ చైర్మన్: గుంజా రేణుక
హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్: దూడెం వెంకట రమణ
లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్: చరణ్ కౌశిక్
తెలుగు అకాడమీ చైర్మన్: ప్రొఫెసర్ వెంకట రమణ
వాషర్ మెన్ – డాక్టర్ అజయ్ కుమార్
గీత కార్మిక – చంద్ర శేఖర్ గౌడ్
పెరిక – గొంగరి వెంకటేశర్లు
మేర – సంగ వెంకట్ రాజం
మున్నూరు కాపు – బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి
పద్మశాలి – గూడూరి శ్రీనివాస్
వెలమ – జువ్వాడి నర్సింగ్ రావు

## భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ నియామకం చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం చెల్లదంటూ హైకోర్టులో టి. ధన్‌పాల్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని హైకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక డీజీపీ నియామకంపై గతంలో దాఖలు చేసిన పిటిషన్‌కు అనుబంధంగా కొత్త అప్లికేషన్‌ను పిటిషనర్ కోర్టులో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని తన పిటిషన్‌లో ధన్‌పాల్ రావు స్పష్టం చేశారు. యూపీఎస్సీ నుంచి అర్హుల జాబితా తీసుకోలేదని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. డీజీపీగా నియామకం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చీఫ్ సెక్రటరీ ర్యాంకులో ఆయనను నియమించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

## కేటీఆర్ వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్

హనుమకొండ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఖండించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యాఖ్యలు 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉన్నాయని ఎద్దేవా చేశారు. శనివారం జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సుపై నాయిని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక నకిలీ విత్తనాలు అమ్మే ముఠా అని, వారి హయాంలో 7 వేల మంది రైతులు మరణించారని ఆయన గుర్తుచేశారు. రైతులపై ఎఫ్ఐఆర్ చేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని, రైతులను నట్టేట ముంచిన చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్‌ను అడ్డంపెట్టుకుని రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ మాట్లాడుతూ' స్క్రిప్ట్ రాసిస్తే చదవడం కాదు, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలి. రాహుల్ గాంధీని విమర్శించే స్థాయా నీది?. ఒకప్పుడు మీ కుటుంబం సోనియా గాంధీ చుట్టూ తిరిగారు. కేటీఆర్ వెంట ఉన్న వాళ్లంతా దోపిడీదారులే.. నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి హనుమకొండ చౌరస్తాకు వస్తావా? రైతులను నట్టేట ముంచింది బీఆర్ఎస్. నా ప్రశ్నలకు కాదు, ముందు నీ చెల్లెలు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వు' అని అన్నారు.

## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే..

**రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత**

**హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు శాపనార్థాలు**

**మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్**

గజ్వేల్(సిద్దిపేట):

బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించిందని... నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే అని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. ఈ నెల 10న ప్రధానమంత్రి మోదీ సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో బుధవారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ఆ యన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో నిర్వహించిన ఐదు రాష్ట్రాల ఎన్నికలతో కుటుంబ పాలనకు కాలం చెల్లిందని నిరూపిం చాయని, బెంగాల్, తమిళనాడులలో కుటుంబ పార్టీలను ప్రజలు ఇంటికి పంపించారన్నారు. చరిత్ర నిర్మాతలు ప్రజలేనని, ప్రజలు అనుకుంటే ప్రళయాన్ని సృష్టించగలరని, ముఖ్యమంత్రులను, మంత్రులను ఓడించి, ఆటోడ్రైవర్‌ను గెలిపించారంటే ప్రజలను తక్కువగా అంచనా వేయవద్దన్నారు. తమిళనాడు ఎన్నికలతో డబ్బులతో ఏదైనా సాధించగలమని భావించే కుటుంబ పార్టీలు బుద్ధి తెచ్చుకోవాలని, అధికారం, అహంకారం, దౌర్జన్యం, బెదిరింపులు, గుండాయిజం, రౌడీయిజం ఎప్పుడూ పనిచేయవని, కేసీఆర్‌ను, మమతా బెనర్జీని అందుకే ప్రజలు ఓడించారని అన్నారు. బెంగాల్‌లో 293 సీట్లలో 206 సీట్లను బీజేపీకి ఇచ్చి సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, 15ఏళ్లు సీఎంగా పనిచేసిన మమత ఓడిపోవడం, పార్టీ నిర్మాణం లేకుండా, సంస్థాగత నాయకులు, డబ్బులు, పరపతి లేకుండా పోటీచేసిన విజయ్ గెలుపొందడంతోనైనా నాయకులు అర్థం చేసుకోవాలన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు విజయ్ ప్రభంజనం సృష్టించారని, సామాన్యులను సైతం గెలిపించి ప్రజలు తమ సత్తాచాటారని కొనియాడారు. తెలంగాణలో రెండేళ్లలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారని, రిటైర్మెంట్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇవ్వడం లేదని, ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. రేవంత్ ప్రభుత్వం నిష్క్రియా పర్వతంగా ఉందని, కాంట్రాక్టర్లు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. 50ఏళ్లుగా తెలంగాణ బీజేపీ నాయకులు సంబరాల కోసం ఎదురు చూస్తున్నారని,సంబరాలు చేసుకునే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. మోదీ సభకు సిద్దిపేట జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్, నాయకులు కప్పర ప్రసాద్, గాడిపల్లి భాస్కర్, సింగం సత్తయ్య, రాంరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, పేర్ల శ్రీనివాస్, నందన్‌గౌడ్, మల్లేశ్, అశోక్‌గౌడ్, మనోహర్‌యాదవ్, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్..

**రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం**

**ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి**

**రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం**

**బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారు**

**కాంగ్రెస్.. కరోనా కంటే డేంజర్**

**మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు**

వరంగల్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల



రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఈరోజు(బుధవారం) వరంగల్ జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

**నా సవాల్ స్వీకరించాలి..**

ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనా మా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరా వు స్వీకరిస్తారో లేదో చెప్పాలని అన్నారు. సమ్మక్క – సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. కానీ యూరియా బస్తాలు ఇచ్చేది మాత్రం తెలియదని కేటీఆర్ విమర్శించారు.

**కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ బోగస్..**

బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. కానీ యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదా అని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హామీ కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ ఒక బోగస్ పత్రం, చిత్తుకాగితమని విమర్శించారు. ఒట్టుపెట్టి ఓట్లు అడిగి రేవంత్‌రెడ్డి నయవంచన చేశారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అది మెగా రైతు మేళా కాదని.. దగా రైతు మేళా అని విమర్శించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఫొటోలు పోలీసుస్టేషన్ల దగ్గర గోడలపై అతికించి... వీళ్లు దొంగలని రాయాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్.. కరోనా కంటే డేంజర్ అని సెటైర్లు గుప్పించారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు.

## కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం: సీతక్క

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.'రైతులను బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ హయాంలో పూర్తి రుణమాఫీ జరగలేదు. నాలుగు విడతలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. కానీ, ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కేసీఆర్ పంట బోనస్ హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోంది. రైతు బంధు నిధుల్లో బీఆర్ఎస్ తీవ్ర జాప్యం చేసింది. మా ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసింది' అని మంత్రి సీతక్క తెలిపారు.'ఫామ్ హౌస్ పాలనలో రైతులు నష్టపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం కట్టుబడి పనిచేస్తోంది. ప్రజల్లో తిరుగుతున్నాం.. ఫారిన్ టూర్లలో కాదు. సమ్మక్క–సారలమ్మ ఆలయంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారు. కమిషన్ల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి. లేకుంటే అదే ప్రజలు బుద్ధి చెప్తారు' అని సీతక్క వెల్లడించారు.

## కెటిఆర్‌కు బండి సంజయ్ కరెక్ట్: అద్దంకి

హైదరాబాద్:

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ కెటిఆర్ దిగజారి మాట్లాడుతున్నారని ఎంఎల్ సి అద్దంకి దయాకర్ విమర్శించారు. కెటిఆర్ కౌంటర్ కు అద్దంకి రీకౌంటర్ ఇచ్చారు. మాజీ సిఎం కెసిఆర్ గురించి కాంగ్రెస్ నేతలు మర్యాదగా మాట్లాడాలని కెటిఆర్ అంటున్నారని, కానీ సిఎం రేవంత్‌పై కెటిఆర్ మర్యాద ఎందుకు మరిచారని ప్రశ్నించారు. ఇకపై కెటిఆర్ మాట్లాడిన భాషతోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు. కెటిఆర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కరెక్ట్ అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏం చేసిందో చర్చిద్దామని సవాల్ విసిరారు. పదేళ్లలో బిఆర్ఎస్ ఏం చేసిందో చెప్పాలని నిలదీశారు. సిబిఐ విచారణ అంటే బిఆర్ఎస్ కు భయం పట్టుకుందని అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. కెటిఆర్ తో తిట్ల పోటీకి తాము రెడీగా ఉన్నాయని అద్దంకి దయాకర్ తెలిపారు.

## రిచ్ కిడ్స్ ట్రాప్ అండ్ రేప్ కేస్ లో సంచలన నిజాలు వెలుగులోకి

హైదరాబాద్:

రిచ్ కిడ్స్ ట్రాప్ అండ్ రేప్ కేస్ లో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటి వరకు 25 మంది రిచ్ మైనర్ బాలికలను అర్జున్ అండ్ కో ట్రాప్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. పోలీసులకు దొరక్కుండా లీగల్ గా చాలా పగడ్బందీగా అర్జున్ అండ్ కో వ్యవహరించారు. తన స్నేహితులు హర్ష, జతిన్, శ్రీజిత్ ల సెల్ ఫోన్ ల నుండి అమ్మాయిలను అన్నదమ్ములు అర్జున్, రాజీవ్ ట్రాప్ చేశారు. పోలీసులకు దొరికినా తన మీదకు రాకుండా స్నేహితుల ఇన్ స్టా గ్రామ్ లను వాడుకున్నారు. మైనర్లు ట్రాప్ అయ్యాక, వారి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో వెళ్లి మైనర్లతో లైంగికంగా అర్జున్ పాల్గొన్నాడు. అలా 25 మంది మైనర్ అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి అర్జున్ అండ్ రాజీవ్ డబ్బులు వసూలు చేశారు. ఇప్పటి వరకు 40 లక్షలకు పైగా మైనర్ అమ్మాయిల నుండి అన్నదమ్ములు వసూలు చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది.

# కొనుగోళ్లు లేక రైతుల పంటలు తడుస్తున్నాయి..!

అన్నాతమ్ముళ్ల తగాదాతో కేంద్రం నిలిచిపోయింది: పుట్ట మధూకర్ ఫైర్

మంత్రి ఇలాఖాలో గింజ కొనకపోవడం అవమానం

ఇంచార్జీ నియామకంపై గందరగోళం విడ్డూరం

అధికారుల నిర్లక్ష్యంతో వడ్లు తడిసిన పరిస్థితి

కాంటాలు లేక రైతుల ఆందోళన

కొనుగోళ్లు ప్రారంభం కాకపోతే రోడ్డు దిగ్బంధం హెచ్చరిక



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, 06 మే 2026

మంథని మండలం అడవిసోమన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెలరోజులుగా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం ఇంచార్జీ నియామకంలో ఎమ్మెల్యే, ఆయన తమ్ముడి మధ్య పంచాయతీ వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్రం ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడంపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంథని ఎమ్మెల్యే మార్కెట్ యార్డు సందర్శించి అన్నీ సక్రమంగా జరుగుతున్నాయని చెప్పడం హాస్యాస్పదమన్నారు. నేలస్థాయి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. అడవిసోమన్‌పల్లి కేంద్రంలో రైతులు నెల రోజులుగా ధాన్యం తీసుకువచ్చి వేచి ఉన్నప్పటికీ కాంటాలు పెట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు ఆందోళనకు దిగిన తర్వాతే కాంటాలు, గన్నీసంచులు తెచ్చినా కొనుగోళ్లు మాత్రం ప్రారంభించలేదని విమర్శించారు. ఇప్పటి వరకు సేకరణ ప్రారంభం కాకపోవడంతో అకాల వర్షానికి సుమారు 50 శాతం ధాన్యం తడిసిపోయిందని, మరోసారి వర్షం పడితే మొత్తం పంట నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంచార్జీ నియామకంలో ఎమ్మెల్యే ఒకరిపేరు, ఆయన తమ్ముడు మరొకరి పేర్లు సూచించడంతో నియామకం ఆలస్యమవుతోందని, ఈ వివాదంలో రైతులే నష్టపోతున్నారని తెలిపారు. మంత్రి ప్రాతినిధ్యం వహించే ప్రాంతంలోనే కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం అవమానకరమని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ కూడా ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పుడు మరిచిపోయారని, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులపై విమర్శలు గుప్పించారు. మంథని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అడవిసోమన్‌పల్లి కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభించాలని, రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మంథని--కాటారం రహదారిని దిగ్భందం చేసి ఆందోళన చేపడతామని అన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్: కమిషనర్ హెచ్చరిక

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, 06 మే 2026






రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, వ్యక్తిగత దాడులు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, హిందూవాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. పశువుల రవాణాకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీస్ శాఖ చర్యలను వివరించారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నట్లు చెప్పారు. పశువుల అక్రమ రవాణా చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, ఇది మూగజీవాలపై క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉల్లంఘనలపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌ స్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షణ పేరుతో దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, నిర్ధారణ లేకుండా షేర్ చేయవద్దని ప్రజలకు సూచించారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీస్ కంట్రోల్ రూమ్ 8712656597, డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ప్రజలందరూ ప్రశాంతంగా జీవించేలా, సామాజిక సామరస్యాన్ని కాపాడేలా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తోందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యానికీ మద్దతు ధరే.. రైతులకు ఊరటనిచ్చిన మంత్రి శ్రీధర్ బాబు

అకాల వర్షాలతో నష్టపోకుండా ప్రత్యేక చర్యలు

రవాణా, హమాలీలు, గన్నీ బ్యాగులపై కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మార్కెట్ యార్డులో కొనుగోళ్లపై మంత్రిపర్యవేక్షణ

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, 06 మే 2026





మంథని: అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. మంథని మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోళ్లను మంత్రి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రంలో అవసరమైన మేర గన్నీ బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మంథని ఆర్డీఓ సురేష్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బుధవారంపేట అభివృద్ధికి నిధులు కేటాయించాలి

మంత్రిని కోరిన కాంగ్రెస్ నాయకుడు బుచ్చయ్య పటేల్

బస్ షెల్టర్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్ ప్రతిపాదనలు

వైకుంఠ రథం, మౌలిక వసతుల అభివృద్ధికి వినతి

సానుకూలంగా స్పందించిన మంత్రి

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, 06 మే 2026



పెద్దపల్లి జిల్లా బుధవారంపేట గ్రామ అభివృద్ధి కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=) నిధులు కేటాయించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బుద్ధార్తి బుచ్చయ్య పటేల్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో బస్ షెల్టర్ నిర్మాణం, వైకుంఠ రథం ఏర్పాటు, పిల్లల కోసం చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటు, తాజ్‌వే నిర్మాణం తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు జూ= నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

# తెలంగాణలో బీజేపీ అధికారం ఖాయం: సునీల్ రెడ్డి

బెంగాల్, అస్సాం ఫలితాలే నిదర్శనం

మోదీ నాయకత్వానికి దేశవ్యాప్తంగా మద్దతు

యువత మార్పు కోరుకుంటోంది అన్న వ్యాఖ్యలు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, 06 మే 2026

పెద్దపల్లి జిల్లా మంథనిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అస్సాం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు ఇతర పార్టీల ప్రలోభాలకు లొంగకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని విశ్వసించి బీజేపీకి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని కోల్పోతోందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో యువత కీలక పాత్ర పోషించిందని, డబ్బు, మద్యం ప్రభావం తగ్గిందని చెప్పారు. దేశంలో అభివృద్ధి కోసం ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, మోదీ నాయకత్వాన్ని దేశమంతా ఆదరిస్తోందని సునీల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# టాస్క్ సెంటర్ ప్రారంభోత్సవంలో త్రీడీ ఆర్ట్ ఆకర్షణ

కళాకారుడు ఎస్ఎస్ఆర్ కృష్ణకు మంత్రి, ఎంపీ అభినందనలు

మంథనిలోనే త్రీడీ ఆర్ట్ శిక్షణకు ప్రణాళిక

యువతకు ఉపాధి అవకాశాల దిశగా కొత్త అడుగు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, 06 మే 2026

మంథని టౌన్‌లో టాస్క్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ సందర్భంగా అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్ఎస్ఆర్ కృష్ణ రూపొందించిన త్రీడీ ఆర్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కళాకృతిని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరిశీలించి కళాకారుడిని అభినందించారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ తదితరులు కూడా కృష్ణ ప్రతిభను కొనియాడారు. మంథని నుంచి అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులు రావడం గర్వకారణమని మంత్రి తెలిపారు. టాస్క్ సెంటర్ ద్వారా త్రీడీ ఆర్ట్ శిక్షణను కూడా అందించి ఆసక్తి ఉన్నవారిని



త్రీడీ ఆర్ట్ టీచర్లుగా తయారు చేసి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కృష్ణ వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా మంథని నుంచే త్రీడీ ఆర్ట్ శిక్షణ ప్రారంభం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించి మంచి భవిష్యత్తు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని మంత్రి పేర్కొన్నారుత్రీడీ ఆర్ట్‌ను తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి యువతను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ సందర్భంగా కృష్ణ కర్ణాటకలో ప్రముఖులకు రూపొందించిన త్రీడీ ఆర్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎంపీ వంశీకృష్ణ, రిటైర్డ్ డీజీపీ రాజీవ్ త్రివేది, ఆర్డీఓ, ఎమ్మార్వో, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, ఖాజా మొయినుద్దీన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నాగేపల్లిలో కర్ణ వేదిక కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

చిన్నారికి ఆశీస్సులు

అందించిన తిరుపతి యాదవ్

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, 06 మే 2026

రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో నిర్వహించిన తీగల సాయి--రిషిక దంపతుల కుమార్తె కర్ణ వేదిక కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను అభినందిస్తూ, చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్



అధ్యక్షుడు రొడ్డ బాపన్న, మాజీ జెడ్పిటిసి ఎల్ల రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల బాపురావు, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండె పోషం, గ్రామ శాఖ అధ్యక్షుడు తీగల సదయ్య, సీనియర్ నాయకులు ఎండి చాంద్ పాషా, గొల్లపల్లి రాయమల్లు, పన్నాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్జున్ సమాచారమ్
సినిమా
CINEMA

# అకాల వర్షం తో రోడ్లపై చెట్లు కూలిపోవడంతో పోలీసుల అప్రమత్త చర్యలు

ప్రజల భద్రతే లక్ష్యం... ఘటన స్థలాలను సందర్శించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, మే 6:

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో అకాల గాలి వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు రోడ్లపై కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే స్పందించి చెట్లను తొలగించి వాహనాల రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎం. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ కలిసి క్షేత్ర స్థాయిలో మంచిర్యాల, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి మార్గాల్లో పడిపోయిన చెట్లను పరిశీలించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు గ్రామస్తుల సహకారంతో చెట్లను తొలగించడం జరిగింది. తరువాత సీపీ దండేపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో సమావేశమై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. అదేవిధంగా, కోత్తూరు గ్రామ బస్టాప్ ప్రాంతంలో గోడ కూలి ఇద్దరు మృతి చెందిన ఘటనతో పాటు గంపలపల్లి గ్రామ శివారులోని సామిల్‌లో గోడ కూలి ఇద్దరు మరణించిన సంఘటనల స్థలాలను పరిశీలించారు. ఈ ఘటనలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించి, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ మార్పుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తోందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వం: బీఆర్ఎస్ ఆరోపణలు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, మే 6:



ముత్తారం మండలంలో ప్రజా పాలన ప్రగతి పథం పేరుతో ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలం లోని ఓడేడ్ గ్రామంలో తన స్వగృహంలో విలేఖర్లతో మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి పథం పేరుతో కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ఏ అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా పాలనలో రైతుల ఇబ్బందులు కనిపించడంలేదా అని ప్రశ్నించిన ఆయన, రైతులకు పంట సాయం అందకపోవడంతో పాటు ఎరువుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కూడా రైతులు ఇబ్బందులు పడుతూ సతమతమవుతున్నారని విమర్శించారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం చేయాలని ప్రభుత్వం చెబుతోందని, అయితే అందుకు అవసరమైన జీలుగ, పెసర, జనుము విత్తనాలు ఇప్పటికీ అందుబాటులో లేవని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలంటే విత్తనాలు సమయానికి అందుబాటులో ఉండాలని సూచించారు. విత్తనాల సరఫరా విషయంలో సంబంధిత అధికారులు "ఇండెంట్ పెట్టాం, ఇంకా రాలేదు" అంటూ మాట దాటవేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు తక్షణమే అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు గూడు.. అభివృద్ధి పథంలో ముత్తారం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, మే 06

ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన మూగ అశ్విని, కిషన్ దంపతులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆశీస్సులతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, ఆ ఇంటి స్లాబ్ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులను అభినందిస్తూ, వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మూగ రవి, ఆకోజు అశోక్, మూగ సంపత్, మండల రాజు, పాండవుల స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సురక్షిత నివాసం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు.



# మంథనిలో టాస్క్--ఏవీజీసీ ... కృత్రిమ మేధస్సు కేంద్రాలు ప్రారంభం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, మే 6 (2026)

మంథని గ్రామీణ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో మంథనిలో టాస్క్--ఏవీజీసీ ఽ కృత్రిమ మేధస్సు కేంద్రం, టాస్క్--సీట్రిఎల్ఎస్ ప్రతిభా కేంద్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొని కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనిమేషన్, దృశ్య ప్రభావాలు, గేమింగ్, కామిక్స్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక రంగాల్లో శిక్షణ పొందితే యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులు కూడా ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే వేదికగా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ ప్రతిభా కేంద్రం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందుతుందని వివరించారు. డిజిటల్




ప్రపంచానికి గ్రామీణ యువతను దగ్గర చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇప్పటివరకు కృత్రిమ మేధస్సు వంటి కోర్సుల కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మంథనిలోనే ఈ అవకాశాలు అందుబాటులోకి రావడం ఆనందకరమని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఆలోచనతో ఈ కేంద్రాన్ని మంథనిలో ఏర్పాటు చేయడం ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. యువత ఈ టాస్క్ కేంద్రాన్ని విస్తృతంగావినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సాంకేతిక కేంద్రాల ఏర్పాటు మంథని ప్రాంతానికి మైలురాయిగా నిలిచింది.

# ఎండల తీవ్రతపై అప్రమత్తం కావాలి: భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, మే 6 (2026)

పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బ ప్రమాదకరమని, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా దాని నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, గుండె తదితర వ్యాధులు ఉన్నవారు మరియు కూలీలు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ రక్షణ అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. వేసవిలో డీహైడ్రేషన్ సమస్య అధికంగా ఉంటుందని, రోజుకు కనీసం 12--15 గ్లాసుల నీరు త్రాగాలని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటికి వెళ్లకుండా నీడలో ఉండాలని, అవసరమైతే ఉదయం 11 గంటల లోపు లేదా సాయంత్రం 4 తర్వాత మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండ సంబంధిత సమస్యలు ఉన్నవారు త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉందని, వీరు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆల్కహాల్, సిగరెట్లు, కార్బొనేటెడ్ పానీయాలను దూరంగా ఉంచాలని



సూచించారు. ఎండలో బయటికి వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపీ లేదా కాటన్ గుడ్డ ధరించాలని, వేడి వాతావరణంలో పని చేసే వారు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ఐదు నిమిషాలు నీడలో విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. ఆహారంలో ద్రవ పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, కారం మసాలాలు తగ్గించాలని సూచించారు. ప్రయాణాల సమయంలో ఎలక్ట్రోలైట్ ద్రావణాలు తీసుకోవడం మంచిదని తెలిపారు. పుచ్చకాయ, కీరదోస, ఖర్జూరం, తాటి ముంజలు, బీరకాయ, పొట్లకాయ వంటి నీటి శాతం అధికంగా ఉన్న ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్ళు తిరగడం, వాంతులు, విరోచనాలు, నోరు ఆరిపోవడం, అపస్మారక స్థితి వంటి లక్షణాలు కనిపిస్తాయని, అలాంటి సందర్భాల్లో బాధితుడిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించి తక్షణ వైద్య సహాయం అందించాలని తెలిపారు. వేసవిలో రక్షణ కోసం తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తరచుగా తాగాలని, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామపంచాయతీలు, ఆశా సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

# అకాల వర్షం రైతుకు కడగండ్లే... రైతు నష్టానికి బాధ్యత ఎవరిది?

ముందస్తు హెచ్చరికలు ఎక్కడ?
యంత్రాంగం ఎందుకు మౌనం?

కళ్లముందే పంట నాశనం...
అన్నదాత కన్నీటి గాధ

ప్రాణాలు పోతేనే స్పందన?
ప్రభుత్వంపై రైతుల ఆగ్రహం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, మే 6 (2026)





పెద్దపల్లి జిల్లా: మంగళవారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం తెలంగాణ రైతాంగంపై కడగండ్ల వాన కురిపించింది. ఎండలతో ఇప్పటికే అల్లాడుతున్న అన్నదాతలపై ప్రకృతి మరోసారి విరుచుకుపడి ప్రాణ నష్టం, పంట నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కళ్లముందే తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు కల్లాల వద్దకు వెళ్లిన రైతులపై మృత్యువు విరుచుకుపడింది. మంచిర్యాల జిల్లాలో నలుగురు రైతులు మృతిచెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపల్లి జిల్లా సహా పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం దంచికొట్టడంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం నీటిపాలైంది. అకాల వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణ హెచ్చరికలు ఉన్నప్పటికీ రైతులకు సరైన సూచనలు, రక్షణ చర్యలు అందకపోవడం తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది. "మా పంట పోయింది... ప్రాణాలు పోయాయి... ప్రభుత్వం ఎక్కడ?" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని, పంట నష్టం పరిహారం ప్రకటించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మంత్రి వివేక్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చినప్పటికీ, స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



## ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తెలంగాణ వాతావరణశాఖ ప్రకారం నేటి నుంచి మే 8 వరకు నాగర్‌కర్నూల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు పడే అవకాశముందని తెలిపింది.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.